# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 134 | విశాఖపట్నం | 14-2-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 134 | VISAKHAPATNAM | 14-2-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...


ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి

# ఏర్పాటు చేశాం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మామూలు విధ్వంసం జరగలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో నాకు జరిగిన అవమానానికి కన్నీళ్లు పెట్టుకున్నానని, నా మాదిరిగానే ఎంతో మంది కన్నీళ్లు పెట్టుకున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా తనను అరెస్టు చేశారని, పవన్ కల్యాణ్ విశాఖ పర్యటనకు వెళ్తే అడ్డుకున్నారని సీఎం అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిశాయని, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 94 శాతం స్ట్రైక్ రేట్ తో ఓటర్ల గెలిపించారని చంద్రబాబు గుర్తు చేశారు. నాడు మమ్మల్ని అడ్డుకున్నవాళ్లు ఈ రోజు నీతులు చెబుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఈ అసెంబ్లీ బూతులకు నమూనాగా ఉండేదని అన్నారు. అభివృద్ధికి ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చిన జనసేన, బీజేపీకి సీఎం ధన్యవాదాలు తెలిపారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని కానీ వారికి ఒక్క పైసా ఇవ్వలేదని అభివృద్ధి చేసి ప్లాట్లు ఇస్తామని చెప్పామని వివరించారు. అలానే రాష్ట్రంలో రౌడీయిజం, నక్సలిజాన్ని నిర్మూలించగలిగాం కానీ రాజకీయ నేతల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఎక్కడికి పోయినా దౌర్జన్యం చేయడం, రోడ్డంతా బ్లాక్ చేస్తున్నారని అన్నారు. గుంటూరు నుంచి విజయవాడ పోవాలంటే ఆరుగంటలా అయితే ఈ ఆరు గంటలూ ప్రజలు నరకం అనుభవించాలా అని ప్రశ్నించారు. జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా పట్టించుకోవట్లేదని సీఎం మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కొంతమంది కావాలనే భక్తుల మనోభావాలు (తరువాయి 4వ పేజీలో)



## తెలంగాణ మున్సిపల్ ఫలితాల్లో

# కాంగ్రెస్ హవా



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ, రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు తమకే పట్టం కట్టారని నిరూపించుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను, కాంగ్రెస్ పార్టీ ఏకంగా 62 చోట్ల విజయం సాధించి జెండా ఎగరేసింది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 12 మున్సిపాలిటీలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. మరో నాలుగు మున్సిపాలిటీల ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం హంగ్ ఫలితాలు (తరువాయి 2వ పేజీలో)



3లో

## వీరవరం గ్రామంలో తాగునీటి కోసం ఆదివాసీల అవస్థలు

## ఇరాన్ దిశగా కదులుతున్న అమెరికా సేనలు



7లో



6లో

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా.. అయితే బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లే..

## వెలుగులోకి వస్తున్న భారత్ బ్యాంక్


# గొంతెన శ్రీనివాస్ వీణ ఆగడాలు




- వెలుగులోకి వస్తున్న భారత్ బ్యాంక్ గొంతెన శ్రీనివాస్ వీణ ఆగడాలు

- నమ్మించి ఉద్యోగాలు అంటూ ఎర
- బ్యాంక్ జాబ్ బిల్డప్ తో అమ్మాయిలకు నమ్మించి ట్రాప్ చేసిన గొంతెన శ్రీనివాస్ వీణ
- ఆ తర్వాత అమ్మాయిలకు ఒకరికి తెలియకుండా మరొకరికి లైంగిక వేధింపులు
- తాజాగా కస్టమర్ దగ్గరికి వెళ్దాం అంటూ తన కారు ఎక్కించుకొని ఓ యువతికి కారు లోనే లైంగిక వేధింపులు
- ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు కారులో నిర్బంధించి లైంగిక వాంఛ తీర్చాలని బలాత్కారం చేసిన కామకేయుడు గొంతెన శ్రీనివాస్ వీణ
- తీవ్రంగా ప్రతిఘటించి గొంతెన శ్రీనివాస్ వీణ ఉచ్చు నుంచి బయటపడ్డ యువతి
- బ్యాంక్ ఉద్యోగాల ముసుగులో గొంతెన శ్రీనివాస్ వీణ ముఠా సాగించే అరాచకాలపై వీడియో రిలీజ్ చేసిన బాధిత యువతి
- యువతుల జీవితాలతో ఆడుకుంటున్న గొంతెన శ్రీనివాస్ వీణ వంటి దుర్మార్గుల భరతం పట్టాలని ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

## వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే వీటిపై చర్చించేందుకు రావాలని, తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని హితవు పలికారు. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార (తరువాయి 3వ పేజీలో)

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై

# మండలిలో రచ్చ

## లోకేష్‌కు బొత్స సవాల్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రచ్చ మొదలైంది. ప్రభుత్వం అసత్యాలు మాట్లాడుతోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఫైర్ అయ్యారు. తమకు వాకౌట్ చేయడం ఫ్యాషన్ కాదని, అలా చేస్తే అయినా కూటమి ప్రభుత్వంలో మార్పు వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. తాము సమాధానాలు చెబితే వినాలని, అవాస్తవాలు మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ (తరువాయి 2వ పేజీలో)

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఆరోగ్య రంగానికి నిధులేవి?

ప్రజారోగ్యం ప్రభుత్వాల మౌలిక బాధ్యత. కానీ తాజా కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే...ఆరోగ్యం పేరుతో ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తూనే, అదే స్థాయిలో ఆరోగ్య రంగానికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం వెనుకంజ వేస్తున్నదన్న వాస్తవం కళ్ల ముందు కనిపిస్తోంది. ముఖ్యంగా 'ఆరోగ్య-విద్యా సెస్సు' పేరుతో వసూలు చేస్తున్న మొత్తం, ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి తగిన విధంగా వినియోగించడం లేదన్న విమర్శలకు తాజా గణాంకాలే బలం ఇస్తున్నాయి. (సెస్ అనేది ఒక నిర్దిష్ట సేవ/రంగం అభివృద్ధి/సంక్షేమం కోసం ప్రభుత్వం వసూలు చేసే పన్ను. ఇది ప్రత్యక్ష, పరోక్ష పన్నులపై వేస్తారు. భారత దేశంలోని గ్రామీణ కుటుంబాల విద్య, ఆరోగ్య అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య-విద్యా సెస్సును వసూలు చేస్తున్నది.) ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 4 శాతం 'ఆరోగ్య-విద్యా సెస్సు'ను వసూలు చేస్తోంది. 2023-24లో ఈ సెస్సు ద్వారా సుమారు ఒక లక్షా పద్దెనిమిది వేల కోట్ల రూపాయలు వసూలయ్యాయి. 2024-25లో ఇది ఒక లక్షా ఇరవై ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. తాజా బడ్జెట్ అంచనాల ప్రకారం ఈ ఆదాయం ఒక లక్షా ముప్పై వేల కోట్ల రూపాయలను దాటే అవకాశం ఉంది. అంటే ప్రజలు ప్రతి సంవత్సరం లక్ష కోట్లకు పైగా మొత్తాన్ని ప్రత్యేకంగా 'ఆరోగ్యం' పేరుతో చెల్లిస్తున్నారు. అయితే ఇదే బడ్జెట్‌లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు కేటాయించిన మొత్తం సుమారు తొంభై రెండు వేల కోట్ల రూపాయలకే పరిమితమైంది. ఆరోగ్య సెస్సు ద్వారా వసూలు చేస్తున్న మొత్తంతో పోలిస్తే ముప్పై నుంచి నలభై వేల కోట్ల రూపాయలు తక్కువగా ఆరోగ్య రంగానికి నేరుగా కేటాయిస్తున్నారు. ఇది కేవలం లెక్కల తేడా కాదు; ఆరోగ్యం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఎంత వెనుకబడి ఉందో చెప్పే స్పష్టమైన సూచిక. కేంద్రం, రాష్ట్రాలు కలిపి ఆరోగ్యానికి చేస్తున్న వ్యయం దేశ జిడిపి లో ఇప్పటికీ రెండు శాతం లోపే ఉంది. జాతీయ ఆరోగ్య విధానం-2017 ప్రకారం 2025 నాటికి ఈ వ్యయాన్ని జిడిపి లో 2.5 శాతానికి పెంచాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ తాజా బడ్జెట్ తర్వాత కూడా ఆ లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఐదు శాతం లక్ష్యంతో పోలిస్తే భారత్ చాలా వెనుకబడి ఉంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం తక్కువగా ఉండటంతో దాని ప్రభావం నేరుగా ప్రజలపై పడుతోంది. ప్రస్తుతం దేశంలో మొత్తం ఆరోగ్య ఖర్చుల్లో వ్యక్తిగత జేబు ఖర్చు సుమారు 47 శాతం వరకు ఉంది. అధికారిక ఆరోగ్య ఖాతాల ప్రకారం ప్రతి సంవత్సరం ఆరు నుంచి ఏడు కోట్ల మంది వైద్య ఖర్చుల కారణంగా పేదరికంలోకి జారిపోతున్నారు. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలక భాగమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్ల పరిస్థితి కూడా ఆందోళన కలిగించేదే. కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభం అవుతున్నప్పటికీ, వాటికి తగిన నిధులు, అధ్యాపకులు, పరికరాలు సమకూరడం లేదు. అనేక కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరత, ల్యాబ్‌లు, లైబ్రరీలు, హాస్టళ్ల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. టీచింగ్ హాస్పిటళ్లలో పడకలు, ఐసియు సదుపాయాలు, ఆధునిక పరికరాల కొరత వల్ల రోగుల సంరక్షణతో పాటు వైద్య విద్య నాణ్యత కూడా దెబ్బతింటోంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులపై రోగుల భారం రోజురోజుకీ పెరుగుతోంది. కానీ ఆ భారం మోయడానికి అవసరమైన బడ్జెట్, మానవ వనరులు అందుబాటులో లేవు. ఫలితంగా విద్యార్థులు సరైన క్లినికల్ అనుభవం పొందలేకపోతున్నారు. అధ్యాపకులు బోధన కంటే సేవల భారంతో అలసిపోతున్నారు. ఇది భవిష్యత్తు వైద్యుల తయారీపైనే ప్రభావం చూపుతోంది. ఇంత జరుగుతున్నా, ఆరోగ్య-విద్యా సెస్సు ద్వారా వచ్చిన నిధులను చట్టపరంగా ప్రత్యేక ఆరోగ్య నిధిగా కేటాయించటం లేదు. ఈ మొత్తం కేంద్ర సమగ్ర నిధిలో కలిసిపోతున్నది. అంటే ఆరోగ్యం పేరుతో వసూలు చేసిన డబ్బులో ఎంత భాగం నిజంగా ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ప్రజారోగ్య కార్యక్రమాలకు ఖర్చయిందో ప్రజలకు స్పష్టమైన సమాచారం లేదు. ఈ పారదర్శకత లోపమే అసలు సమస్య. దేశంలోని మొత్తం మరణాల్లో అరవై శాతం పైగా...సాంక్రమికేతర (నాన్-కమ్యూనికబుల్) వ్యాధుల కారణంగా చోటుచేసుకుం టున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యలు, వృద్ధుల ఆరోగ్య అవసరాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజారోగ్య వ్యవస్థను, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను బలోపేతం చేయడం తప్పనిసరి. కానీ తాజా బడ్జెట్‌లో ఆ దిశగా అవసరమైన పెట్టుబడి కనిపించడం లేదు.

ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం మోయాల్సిన చోట, నెమ్మదిగా ప్రజలకు భారంగా మారుస్తున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఆరోగ్య సెస్సును ప్రత్యేక ఆరోగ్య నిధిగా మార్చి, ప్రతి రూపాయి ఎలా ఖర్చవుతుందో ప్రజలకు చెప్పే పారదర్శక వ్యవస్థ వుండాలి. బడ్జెట్‌లో ఆరోగ్యానికి కేటాయింపులూ పెంచాలి. లేనిపక్షంలో, ప్రజారోగ్యం గాలిలో దీపమే అవుతుంది.

## రెవెన్యూ సమస్యలపై ప్రశ్నలు .. తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయన్న మంత్రి అనగాని



**అమరావతి, పతాకం న్యూస్:** పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న ఫిర్యాదుల్లో 61 శాతం రెవెన్యూకు సంబంధించినవి ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ సదస్సులు, ఫిర్యాదుల పరిష్కారంపై ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. వైఎస్సార్సీపీ హయాంలో రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు అనగాని తెలిపారు. ఫ్రీ హోల్డర్ భూముల విషయంలో మంత్రి వర్గ ఉప సంఘం వేశామని, చట్ట వ్యతిరేకంగా జరిగిన వాటిని గుర్తించి సరిచేస్తామని ఆయన చెప్పారు. ఆ తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయి: రీసర్వేలపై కూడా లక్షా 70వేల ఫిర్యాదులు వచ్చాయన్నారు. జేసీల దగ్గర ఉన్న అధికారాలు ఆర్డీఓ, ఎమ్మార్వోకు ఇచ్చి వేగంగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. రెవన్యూ సదస్సులు పెడుతున్నా ఇంకా ఎందుకు సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు గట్టిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయని, ఫ్రీ హోల్డ్ భూములుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌లు వాగులు వంకలు ఇష్టానుసారంగా మార్చారని ఆరోపించారు. లిటిగేషన్ ఉన్న భూములను వైఎస్సార్సీపీకి చెందిన మాజీ శాసనసభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. 'ఫ్రీహోల్డ్, ఈనాం భూముల గురించిన అన్ని అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలనలు జరుతున్నాం. ప్రతీ నెల సంబంధిత అధికారులతో చర్చలు జరిపి చర్యలు చేపడుతున్నాం. పేదవారికి ఎలాంటి నష్టం జరగకుండా చూసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. వైఎస్సార్సీపీ హయాంలో రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఫ్రీ హోల్డర్ భూముల విషయంలో మంత్రివర్గ ఉపసంఘం వేశాం. చట్ట వ్యతిరేకంగా జరిగిన వాటిని గుర్తించి సరిచేస్తాం.' అని అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి భూ యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిస్తూ 5 రకాల భూములను 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ గత నెలలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సంతకం చేసిన సంగతి తెలిసిందే. మిగిలిన 5 రకాల భూములపై త్వరలో జీవోఎంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గతంలోనే తెలిపారు. శాసనసభలో ఇవాళ మూడు బిల్లులకు ఆమోదం లభించింది. మున్సిపల్ చట్టంలో సవరణలు చేస్తూ రెండు బిల్లులను ప్రవేశ పెట్టారు. మంత్రి నారాయణ శాసనమండలిలో ఉండటంతో ఆయన బదులు మంత్రి టీజీ భరత్ ఈ బిల్లులు ప్రవేశ పెట్టారు. విద్యుత్తు చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీలో ఆమోదం పొందాయి.

## సాగరమాల ద్వారా మత్స్యకారులకు న్యాయం: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో మూడోరోజు ప్రశ్నోత్తరాల కార్యక్రమం కొనసాగుతోంది. పెందుర్తి నియోజకవర్గంలో మినీ జెట్టి నిర్మాణంపై పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు (వీఱఅఱర్‌వతీ ఖఱఅయిఖితీఖజూబ ఘ్ఎష్ట్రఖఅఖఱఅబ) సమాధానం ఇచ్చారు. జువలదిన్నె, మచిలీపట్నం వంటి ఫిషింగ్ హర్బర్‌ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని వివరించారు. పనులు లేని సమయంలో రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి పని కల్పించామన్నారు. విశాఖపట్నం హర్బర్ చాలా దారణంగా తయారైందని అన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అధునాతన పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. సాగరమాల కార్యక్రమం ద్వారా మత్స్యకారులను న్యాయం చేస్తామన్నారు. కాకినాడ ఫిషింగ్ హర్బర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముత్యాలమ్మపాలెం జెట్టి నిర్మాణానికి సరైనదని ప్రభుత్వం రిపోర్టు కూడా ఇచ్చిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## వితంతు పెన్షన్లపై త్వరలో నిర్ణయం: మంత్రి శ్రీనివాస్



**అమరావతి, పతాకం న్యూస్:** పెన్షన్లకు సంబంధించి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా.. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పలు ప్రశ్నలు సంధించారు. 2024 తర్వాత పలువురికి వితంతు పెన్షన్లు రావడం లేదని ప్రశ్నించారు. ధర్మరాజు అడిగిన ప్రశ్నకు ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జవాబిచ్చారు. త్వరలోనే వితంతు పెన్షన్‌లు ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పుకొచ్చారు. ఇప్పటికే ఈ పెన్షన్లకు సంబంధించి సీఎం చంద్రబాబుతో చర్చించామని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. రేవంత్‌రెడ్డిని అభినందించిన ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటిస్తున్నారు. హస్తినలో సీఎం పర్యటన షెడ్యూల్ బిజీ బిజీగా సాగుతోంది. రెండు రోజుల పర్యటనలో భాగంగా పలువురు నేతలతో రేవంత్ సమావేశమవుతున్నారు. శుక్రవారం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘన విజయంపై చర్చ జరిగింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ సాధించిన విజయంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పార్టీకి వచ్చిన మద్దతు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయంతో పార్టీ కేడర్‌లో నూతన ఉత్సాహం నెలకొన్నదని, భవిష్యత్తు ఎన్నికల కోసం ఇది బలమైన పునాది అని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రియాంక గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. పార్టీ శ్రేణులతో సమన్వయం, ఎన్నికల వ్యూహరచన, స్థానిక స్థాయిలో బలమైన ప్రచారం ఇవి విజయానికి దోహదపడ్డాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రియాంక గాంధీకి వివరించారు.

(మొదటిపేజీ తరువాయి)

## కాంగ్రెస్ హవా

సుమారు 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇది రాబోయే రోజుల్లో రాజకీయ వేడిని మరింత పెంచనుంది. మున్సిపాలిటీలతో పాటు ఏడు కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ పార్టీ తన హవాను కొనసాగించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో స్పష్టమైన మెజారిటీ సాధించగా, మహబూబ్‌నగర్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలుచుకుని సమ ఉజ్జీలుగా నిలిచాయి. మరోవైపు, బీజేపీ తమకు బలమైన పట్టున్న నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ రెండు ప్రాంతాలు బీజేపీ సిట్టింగ్ లోక్‌సభ స్థానాలు కావడం గమనార్హం. వార్డుల వారీగా చూస్తే, మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను, శుక్రవారం సాయంత్రం 4:30 గంటల వరకు 2,543 స్థానాల ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్ 1,325 వార్డులు గెలుచుకోగా, బీఆర్ఎస్ 707, బీజేపీ 260 వార్డుల్లో విజయం సాధించాయి. ఎంఐఎం, ఇండిపెండెంట్లు కలిపి 251 స్థానాలను దక్కించుకున్నారు. కార్పొరేషన్ల పరిధిలోని 414 డివిజన్లకు గాను వెలువడిన 291 ఫలితాల్లో, కాంగ్రెస్ 154, బీఆర్ఎస్ 49, బీజేపీ 34, ఇతరులు 54 స్థానాలు కైవసం చేసుకున్నారు.

## పని చేస్తుంది: పవన్

సాక్షి పత్రిక తనపై అసభ్యకర కథనాలు ప్రచురించిందని జనసేన పార్టీకి చెందిన యలమంచిలి ఎమ్మెల్యే సుందరం విజయకుమార్ ఆరోపించారు. తాను భూకబ్జాకు పాల్పడినట్లు సాక్షిలో వచ్చిన కథనంపై అసెంబ్లీలో మాట్లాడారు. అసత్య కథనాల వల్ల తన గౌరవానికి భంగం కలిగిందని దీనిపై సభాహక్కుల కమిటీకి ఫిర్యాదు పంపాలని విజ్ఞప్తి చేశారు. అ సమయంలో అసెంబ్లీలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఈ విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ప్రతిపక్ష హోదా తప్ప ప్రజా సమస్యలపై ఆసక్తి లేదు: గత ప్రభుత్వంలో పంచాయతీలు, జెడ్పీ నిధులు పక్కదారి పట్టించారని జనసేన ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ యాదవ్, సుందరపు విజయ్ కుమార్‌లు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పాలన జరుగుతోందని, అడవితల్లి బాట పట్టి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 1050 కిలోమీటర్ల రోడ్లు వేయించారని చెప్పారు. వైఎస్సార్సీపీ నేతలు ప్రతిపక్ష హోదా అడుగుతున్నారు తప్ప ప్రజా సమస్యల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. విశాఖ వేదికగా త్వరలో 5 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు తిరిగి తాము అధికారంలోకి వస్తామంటూ అధికారులను, పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇవాళ మూడు బిల్లులకు ఆమోదం లభించింది. మున్సిపల్ చట్టంలో సవరణలు చేస్తూ రెండు బిల్లులను ప్రవేశ పెట్టారు. మంత్రి నారాయణ శాసనమండలిలో ఉండటంతో ఆయన బదులు మంత్రి టీజీ భరత్ ఈ బిల్లులు ప్రవేశ పెట్టారు. విద్యుత్తు చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీలో ఆమోదం పొందాయి.

## మండలిలో రచ్చ

రూ.8,500 కోట్లు బకాయిలున్నాయని, కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.700 కోట్లు మాత్రమే చెల్లించిందని, ఇంకా రూ.7,800 కోట్లు పెండింగ్ ఉన్నాయని ఆరోపించారు. జగన్ హయాంలో బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లించామని, కూటమి ప్రభుత్వం 8 విడతల బకాయి పెట్టిందని మండిపడ్డారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పందిస్తూ, వైసీపీ సభ్యులు అవాస్తవాలు చెబుతున్నారని, ఏ క్వార్టర్‌కు ఆ క్వార్టర్ చెల్లింపులు చేశామనడం అబద్ధమని అన్నారు. ఇప్పటివరకు రూ.1,859 కోట్లు చెల్లించామని, ఈ విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బకాయిలు పూర్తిగా క్లియర్ చేశామని వివరించారు. కాలేజీలకు ఇప్పటికే చెల్లింపులు చేసిన విద్యార్థుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని తెలిపారు. బొత్స సత్యనారాయణ మళ్లీ స్పందిస్తూ, గత ప్రభుత్వం రూ.4,000 కోట్లు బకాయి పెట్టిందని చెప్పడం అసత్యమని, ఎన్నికల కోడ్ వల్ల ఒక్క క్వార్టర్ మాత్రమే పెండింగ్ అయిందని, అది కూడా అప్పటి ప్రతిపక్షం (టీడీపీ) ఈసీకి ఫిర్యాదు చేయడం వల్ల జరిగిందని అన్నారు. పెండింగ్ బకాయిలు ఎప్పటికి చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి నారా లోకేశ్ కౌంటర్ ఇస్తూ, బొత్స బకాయిలు లేవని చెప్పడం నిజం కాదని, రికార్డుల ప్రకారమే మాట్లాడుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రూ.4,064.59 కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిందని, అన్ని ఆధారాలు సభ ముందు ఉంచుతామని స్పష్టం చేశారు.

# వీరవరం గ్రామంలో తాగునీటి కోసం ఆదివాసీల అవస్థలు



**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** మండలంలోని గూడెంకొత్తవీధి పంచాయతీ వీరవరం గ్రామంలో ఆదివాసీలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి పథకాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఆదివాసీ మహిళలు గ్రామ శివారులో ఉన్న ఊటగెడ్డ నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. తాగేందుకు ఊటగెడ్డ నీళ్లను వినియోగించడం వల్ల తరచూ వ్యాధులకు గురవుతున్నారు. వీరవరం గ్రామం కొయ్యూరు, జీకేవీధి మండలాల సరిహద్దులో ఉంది. గ్రామంలో 35 మంది ఆదిమజాతి ఆదివాసీలు(పీవీటీజీ) సుమారు 60 ఏళ్లుగా వీరవరం గ్రామంలో జీవిస్తున్నారు. ఆదివాసీలందరూ పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో రెండు వీధులున్నాయి. రెండు వీధుల గిరిజనులు తాగేందుకు ఎటువంటి రక్షిత మంచినీటి పథకం అందుబాటులో లేదు. ఒక వీధి గిరిజనులకు నాలుగేళ్ల క్రితం గ్రావిటీ మంచినీటి పథకం నిర్మించినప్పటికి ఆరు నెలలకే మూలకు చేరింది. గత వైసీపీ పాలకులు, అధికారులు గ్రావిటీ పథకం నిర్వహణ, మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల పూర్తిగా పాడైపోయింది. ప్రస్తుతం రెండు వీధుల గిరిజనులు గ్రామ శివారులో ఉన్న ఊటగెడ్డ నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. ఈ ఊటగెడ్డ గ్రామానికి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఊటగెడ్డకు పొలాల గట్లపై నడిచి వెళ్లాలి. గ్రామ శివారులో ఊటగెడ్డ ఉండడం, పొలాల గట్ల పైనుంచి నడిచి వెళ్లాల్సి రావడంతో మహిళలు ఒంటరిగా వెళ్లలేకపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గుంపులుగా మహిళలు ఊటగెడ్డకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వర్షాకాలం ఈ ఊటగెడ్డ కలుషితమైపోతుంది. వేసవిలో నీటి నిల్వలు తగ్గిపోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాగా గ్రామానికి చెందిన గిరిజనులు ఊటగెడ్డ నీళ్లను తాగేందుకు వినియోగించడం వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. అన్ని సీజన్లలో జలుబు, దగ్గు, జ్వరాలు, అతిసార, చర్మవ్యాధులకు గురవుతున్నారు.

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రావికమతం మండలం కల్యాణపులోవ, గొలుగొండ మండలం ధారమఠం, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం పుణ్యగిరి శైవక్షేత్రాలకు జిల్లా నుంచి 95 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డీపీటీవో ప్రవీణ చెప్పారు. ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, గత ఏడాది శివరాత్రికి 75 ప్రత్యేక బస్సులు నడిపామని, అయితే రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలులోకి తీసుకువచ్చిన తరువాత మహిళా ప్రయాణికుఉలు పెరగడంతో ఈ ఏడాది మరో 20 బస్సులను అదనంగా నడుపుతున్నామని తెలిపారు. కల్యాణపులోవకు అనకాపల్లి డిపో నుంచి 35 బస్సులను, నర్సీపట్నం డిపో నుంచి 40 బస్సులను, ధారమఠానికి నర్సీపట్నం డిపో నుంచి 10 బస్సులను నడపనున్నామన్నారు. చోడవరం నుంచి కల్యాణపులోవకు ఐదు బస్సులు, అనకాపల్లి నుంచి ఐదు బస్సులను పుణ్యగిరికి నడపనున్నట్టు చెప్పారు. ఈ బస్సులన్నీ 15వ తేదీ ఉదయం నుంచి 16వ తేదీ సాయంత్రం వరకు అందుబాటులో వుంటాయని పేర్కొన్నారు. గతంలో కల్యాణపులోవ సమీపానికి ఆర్టీసీ బస్సులు వెళ్లడానికి అవకాశం వుండేది కాదని, అయితే ఈసారి పోలీసు అధికారులు పార్కింగ్ స్థలాలను అభివృద్ధి చేయడంతో ఆలయం సమీపం వరకు బస్సులు వెళతాయని ఆమె తెలిపారు. కాగా స్త్రీ శక్తి పథకం ద్వారా గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి 97 లక్షల 71 వేల 952 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం సాగించారన్నారు. వీరిలో 60 లక్షల 86 వేల 970 మంది అనకాపల్లి డిపో నుంచి, 36 లక్షల 84వేల 982 మంది నర్సీపట్నం డిపో నుంచి ప్రయాణం సాగించారన్నారు. 15 ఏళ్ల సర్వీసు పూర్తయిన బస్సులు అనకాపల్లి డిపోలో ఆరింటిని, నర్సీపట్నం డిపోలో ఐదింటిని నిలిపివేశామని తెలిపారు. కొత్త బస్సుల కేటాయింపునకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయని డీపీటీవో ప్రవీణ పేర్కొన్నారు.

## డ్రగ్స్, గంజాయిని వ్యతిరేకించాలంటూ ఎస్ఎఫ్ఐ ర్యాలీ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** డ్రగ్స్, గంజాయి ని వ్యతిరేకించాలంటూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కంచరపాలెం ఊర్వశి జంక్షన్ నుండి మెట్టు వరకు ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీ ని ఉద్దేశించి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న మాదకద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గంజాయి మాఫియాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కఅషి చేయాలని కోరారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్, గంజాయి మాఫియా విచ్చలవిడిగా రవాణా అవుతుందని, ప్రభుత్వం ముఖ్యంగా కొంతమంది పోలీస్ అధికారులే చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించకుండా ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. డ్రగ్స్ మాఫియా ఆగడాలు వల్ల యువతులకు రక్షణ కరువైందని అన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయిని అందరి బాగసౌమ్యంతో తిప్పి కొట్టాలని కోరారు. డ్రగ్స్, గంజాయి వల్ల ఆత్మగౌరవం ఉండదు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం పాలు అవుతారని అన్నారు. గంజాయి డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్ డివైఎఫ్ఐ జిల్లా అద్యక్షులు రాజు ఉపాధ్యక్షులు శ్రావణ్, శైలు జిల్లా నాయకులు ఎర్నికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు- అరకులోయ హైవేలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో నేర నియంత్రణలో భాగంగా అక్రమ కార్యకలాపాలపై పటిష్ఠ నిఘా కొనసాగిస్తున్నామని ఎస్పీ అమిత్‌బర్ధార్ విలేకరులకు తెలిపారు. నిఘాలో భాగంగా మండల కేంద్రాలు, ముఖ్యమైన కూడళ్ల వద్ద వాహనాలు, వ్యక్తుల తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. మారుమూల ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా పెట్టామన్నారు. గంజాయి రవాణా, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు సిబ్బంది నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. అలాగే ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని ఎస్పీ వివరించారు.

## పరిశ్రమల ఏర్పాటుకు
# వేగంగా అనుమతులు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలు, పారిశ్రామిక అనుమతులు, ఏర్పాటు చేసిన యూనిట్లకు అందించాల్సిన ప్రోత్సాహకాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారిశ్రామిక అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పాలసీలో వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో వున్న దరఖాస్తులపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పరిశ్రమలు స్థాపనకు అందిన దరఖాస్తులు పరిశీలించి అర్హత, ఆసక్తిగల వారికి వెంటనే అనుమతులు జారీచేసి, అవసరమైన మేర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టంచేశారు. అవసరమైతే బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణ సదుపాయం కల్పించేందుకు సహకారం అందించాలని సూచించారు. అనుమతులు మంజూరు చేసిన యూనిట్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి, ఉత్పత్తిని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. పరవాడ మండలంలో నోటిఫైడ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో అవసరమైన అనుమతులు పొందకుండానే బొగ్గు ప్రాసెసింగ్, హ్యాండ్లింగ్ చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్న మెస్సెర్స్ ఎస్.సుధాకర్, మెస్సెర్స్ వేదప్రియ రిసోర్సెస్ పరిశ్రమలపై విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. విచారణ అనంతరం పర్యావరణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల శాఖల అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ఎల్‌డీఎం సత్యనారాయణ, కమిటీ సభ్యులు, మైనింగ్, విద్యుత్, జీఎస్టీ, ఏపీఐఐసీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది: లోకేశ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ముందుగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, విపక్ష నేత బొత్స సత్యనారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న కాంటీన్లు మూసివేయబోమని సభలో చెప్పి మాటతప్పారని, ఇప్పుడు వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవంటూ నీతులు చెబుతున్నారని అన్నారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవని చెబుతున్నారని, 2020- 2021 ఏడాది క్యూ-4 పెండింగ్ 683.1 కోట్లు, 2023-24 క్యూ-2, క్యూ-3, క్యూ-4 బకాయిలు 1753.98 కోట్లు, 2023-24 ఏడాది గమనిస్తే ఎంటీఎఫ్ ఎరియర్లు సుమారు రూ.895 కోట్లు బకాయిలు పెట్టారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించినట్లు సభ్యులు చెబుతున్నారని, ప్రభుత్వం మారే సమయంలోనూ రూ.645 కోట్ల బకాయిలు చెల్లించలేదని అన్నారు. తాను ఈ విషయాలను పూర్తి ఆధారాలతో చెబుతున్నానని లోకేశ్ అన్నారు. విద్యాశాఖ మంత్రిగా మాట్లాడేందుకు తనకు హక్కు ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై బొత్స స్పందిస్తూ, వైసీపీ హయాంలో రూ.4 వేల కోట్ల బకాయిలు లేవని, రెండు వాయిదాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇంటర్ విద్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ వాకౌట్ చేయడంపై నారా లోకేశ్ స్పందించారు. "నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్దాలు చెప్పి బయటకు వెళుతున్నారు. ఇంటర్ విద్యపై దృష్టి పెట్టడం లేదంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 70 వేల మంది విద్యార్థులు పెరిగారు. అదీ ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పుస్తకాలు, బ్యాగ్స్ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం రద్దు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. మేం ఇంటర్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్దరించాం. పుస్తకాలు ఇస్తున్నాం. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వెళతారు. హాయిగా టీ తాగి ఆ తలుపు నుంచి వస్తారు" అని ఎద్దేవా చేశారు. చిత్తశుద్ధి ఉంటే వైసీపీ మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సమాధానం ఇస్తున్నామని అన్నారు. సమస్యలు లేవని మేం చెప్పడం లేదన్నారు. వాటిని వినడానికి అలాగే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. పరదాలు కట్టుకుని తాము తిరగడం లేదని మంత్రి లోకేశ్ అన్నారు. ఇప్పుడు అసెంబ్లీకి ముఖ్యమంత్రి వస్తుంటే ప్రజలు నవ్వుతూ చేతులు ఊపుతున్నారని, గత ముఖ్యమంత్రి మాత్రం రోడ్లపై 3వేల మంది పోలీసులను పెట్టేవారని ఎద్దేవా చేశారు. నాడు యుద్ధవాతావరణం ఉండేదని అన్నారు. ఇప్పుడు ప్రజలు ప్రశాంతంగా, హాయిగా తిరగగలుగుతున్నారని, ఇదీ తమ చిత్తశుద్ధి అన్నారు. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని, విపక్ష నేతను పిలిపించాలని అన్నారు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారని విమర్శించారు. ప్రశ్నించే హక్కు తనకు ఉందని, వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ బడిలోనే ఉజ్వల భవిష్యత్తు



**వి.ఆర్.పురం, పతాకం న్యూస్:** సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే నిలయాలు ప్రభుత్వ పాఠశాలలేనని మండల తహశీల్దార్ వై. సరస్వతి అన్నారు. యుటిఎఫ్ రూపొందించిన 'ప్రభుత్వ బడి –ప్రవేశాల గోడ పత్రిక'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి,సమానత్వ భావనను పెంపొందించే శక్తి ఒక్క ప్రభుత్వ బడికే ఉందన్నారు. మండలంలోని తల్లిదండ్రులు, ప్రభుత్వ ఉద్యోగులు,యువత తమ పిల్లలను స్థానిక ఊరి బడిలోనే చేర్పించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు యుటిఎఫ్ చేపట్టిన చైతన్య ప్రచార కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పోలవరం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. వెంకట్, ఎన్. జగదీశ్, ఎన్.రామకృష్ణ, ఎం.బాబు, శారద, అమృత, కుసుమ కుమారి, అర్జున్, రాజు, టి ప్రసాద్, కె. రమేష్, బి. పవన్, వెంకన్నబాబు, వెంకట రాజు, వెంకటేష్ బాబు, సూరిబాబు, మణికంఠ, శంకర్ పాల్గొన్నారు.

## 100 కిలోల గంజాయి పట్టివేత



**సీలేరు, పతాకం న్యూస్:** అక్రమంగా 100 కేజీలు గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ యాసీన్ తెలిపారు. విలేకర్లతో మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు సీలేరు, చిత్రకొండ జంక్షన్ వద్ద మాటువేసి ఒడిశా నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా, అందులో 100 కేజీలు గంజాయి గుర్తించామన్నారు. కారులోని ముగ్గురు వ్యక్తులు పల్నాడు జిల్లా నకిరికల్ మండలం చేజర్లకు చెందిన సప్ప రావుగోపి, ఇప్పూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన మారిబోయిన వెంకటేశ్వరరావు, కోమడిగంటి అనిల్‌గా గుర్తించారు. గంజాయి స్వాధీనం చేసుకుని, కారు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

## డంపింగ్ యార్డు తరలించాలని వంటావార్పు



**గాజువాక, పతాకం న్యూస్:** రామచంద్రనగర్ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని కోరుతూ యార్టు ఎదుట రోడ్డుమీద స్థానికులు వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు పోరాట కమిటీ అడ్వైజర్లు, 76వ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, శంకరనారాయణ, మమ్మన మురళి, ఎం.రాంబాబు, రౌతు గోవిందరావు మాట్లాడుతూ, మూడు రోజులుగా స్థానికులు డంపింగ్ యార్డును తరలించాలని ధర్నా, నిరసనలు చేస్తున్నా ఇంతవరకు అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్లపై వంటావార్పు కార్యక్రమం చేసినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 16 గ్రామాలు ప్రజలు, మహిళలు రోజూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అప్పటికీ అధికారులు స్పందించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.చిన్నతల్లి, లక్ష్మి, జోత్స్న, వి.నారాయణరావు, డి.రమణ, రమేష్, ఎంకె.మూర్తి, సతీష్, శ్రీదేవి, 16 గ్రామాల మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



**కొత్తవలస, పతాకం న్యూస్:** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పోస్టుకార్డుల ద్వారా లేఖలను పంపించారు. పీఆర్సీ కమీషన్‌ను ఏర్పా టు చేయాలని, 29 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, ఐద్యోగుల, పెన్షనర్ల బకాయిల చెల్లింపునకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు జి.పార్వతి, జి.వెంకటనాయుడు, వి.సురేష్ కుమార్, సీహెచ్ నిర్మలాదేవి, జి.విజయగౌరి, సూరిఅప్పారావు పాల్గొన్నారు.

## పలాస మార్కెట్‌లో జోరుగా
# జీడిపప్పు విక్రయాలు



**పలాస, పతాకం న్యూస్:** పలాస-కాశీబుగ్గ జీడిమార్కెట్‌లో జీడిపప్పు ధరలు ఊపందుకున్నాయి. ప్రథమశ్రేణి జీడిపప్పు ధర కిలో రూ.900 పలుకుతోంది. కేవలం 15 రోజుల వ్యవధిలోనే అన్ని రకాల జీడిపప్పులపై కిలోకు రూ.50 పెరగడంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా దేశీయంగా లభిస్తున్న జీడి పిక్కల ధరలు యథాస్థితిలో కొనసాగుతున్నాయి. కానీ విదేశీ జీడిపిక్కలు.. ముఖ్యంగా టాంజేనియా దేశానికి చెందినవి అమాంతంగా ధర పెరిగాయి. ప్రస్తుతం జీడి ప్రాసెసింగ్‌లో వ్యాపారులు బిజీగా ఉన్నారు. దేశవిదేశాల నుంచి ఆర్డర్లు వస్తుండడంతో జీడిపప్పు తయారీలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలోనే పలాస జీడిపప్పు ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం జీడిపప్పు ఎగుమతి, దిగుమతికి ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు జీడి హబ్ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. దీంతోపాటు జీడి ఎగుమతి, దిగుమతిపై ఉన్న సుంకాలు సైతం ఎత్తివేసి సులభతరమైన మార్కెట్‌కు అవకాశం కల్పించారు. ఈక్రమంలో 15 రోజుల్లోనే కిలో జీడిపప్పుపై రూ.50 పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది. విదేశాల నుంచి తీసుకువచ్చిన జీడిపిక్కలు ప్రస్తుతం పలాస మార్కెట్‌లో రాజ్యమేలుతున్నాయి. దేశీయ పిక్కలు లభ్యం కాకపోవడంతో టాంజేనియా, ఘనా, ఐవిరికోస్ట్, శ్రీలంక వంటి దేశాల నుంచి పిక్కలు తెప్పిస్తున్నారు. జిల్లాలో మొత్తం 400 వరకూ జీడి పరిశ్రమలు ఉండగా ఒక్క పలాస-కాశీబుగ్గలోనే 250 పరిశ్రమల వరకూ ఉన్నాయి. మన దేశంలో మన రాష్ట్రంతో పాటు గోవా, ఒడిశా, తెలంగాణ, కేరళ, గురజాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జీడిపంట సాగవుతోంది. మన రాష్ట్రంలో.. జిల్లాలోని పలాసలో ఎక్కువగా జీడి పరిశ్రమలు ఏర్పడ్డాయి. దేశీయంగా లభ్యమయ్యే జీడి ఉత్పత్తుల్లో పలాస మార్కెట్‌నే ఎక్కువగా వ్యాపారులు ఎంపిక చేసుకుంటారు. మార్కెట్ ఒడిదొడుకులు కారణంగా ప్రస్తుతం ఒడిశాలో ఎక్కువగా జీడి పరిశ్రమలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్కెట్ కాస్త అటువైపు వెళ్లడంతో ఏడాదిగా పలాస మార్కెట్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ సమయంలో జీడిపప్పు ధర పెరిగి.. మంచి మార్కెట్ లభిస్తుండడంతో వ్యాపారుల్లో ఆశలు మళ్లీ చిగురించాయి. ప్యాకింగ్‌లు ఆర్డర్లతో వ్యాపారులు బిజీగా ఉన్నారు. అలాగే జీడి పిక్కలకు గిట్టుబాటు కల్పించాని డిమాండ్ చేస్తున్న రైతులకు పెరిగిన ధర.. స్వల్ప ఊరటనిస్తోంది. అయితే వారు 80 కిలోల బస్తా రూ.16వేలు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. టాంజేనియా పిక్కలతో పోటీ పడితే రైతులు ఆశిస్తున్న ధరకు చేరుకునే అవకాశం ఉంది.

## ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** కేడీ కాలనీ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖి అయ్యారు. వారి చదువుల కోసం ఆరా తీశారు. అనంతరం పాఠశాల స్టాక్ రిజిస్టర్, విద్యార్థుల హాజరును పరిశీలించార మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భద్రగిరిలోని గిరిజన సంక్షేమ పీటీజీ బాలికల నివాస పాఠశాలను ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ముఖ్యంగా పీటీజీ గ్రూప్‌నకు చెందిన బాలికల విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధిపనులు, విద్యార్థినులకు అందుతున్న వసతులను పరిశీలించారు.

## హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ పేరుతో దోపిడీకి పాల్పడితే చర్యలు: ఎస్పీ దామోదర్



**విజయనగరం, పతాకం న్యూస్:** నేషనల్ హ్యూమన్ రైట్స్ కమి షన్, ఆర్టీఐ అధికారుల పేరుతో దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఇటీవల కొంతమంది నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, ఆర్టీఐ అధికారుల పేరుతో అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి.. వారి నుంచి డబ్బు లు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అటువంటి వ్యక్తుల స మాచారం అందిస్తే, వారిపై కఠిన చర్యలు చేపట్టి రౌడీషీట్లు తెరుస్తామని ఆ యన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ గ్రామ స్థాయిలో ఎవరినీ సభ్యులుగా నియమించదని ఆయన తెలిపారు. ఇటీవల కొం తమంది హ్యూమన్ రైట్స్ కమిషన్ తనని సభ్యులుగా నియమించిందని చెప్పి.. అమాయక ప్రజలను మభ్యపెట్టి, బలవంతంగా వారి నుంచి డబ్బులు వసూలు కు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే కొంతమంది ఆర్టీఐ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి వ్యక్తులు బెదిరింపులకు పాల్పడితే, స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు అందితే పోలీసులు కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్‌టియు ధర్నా




**విజయనగరం, పతాకం న్యూస్:** రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్ టి యు ఏపీ) రాష్ట్ర సంఘం పిలుపుమేరకు దశల వారి పోరాటంలో భాగంగా శుక్రవారం స్థానిక విజయనగరం కలెక్టరేట్ వద్ద, ఎస్టియు విజయనగరం జిల్లా అధ్యక్షులు వై అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ ఆధ్వర్యంలో ధర్నా శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా 11 వ పిఆర్ సి కాలం ముగిసి 30 నెలలు గడిచాయని, ఐనా 12 పీఆర్సీ కమీషన్ ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం సరికాదని, తక్షణమే ఏర్పాటు చేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో 30 శాతం తగ్గకుండా మధ్యంతర భఅతి కావాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి డి శ్యామ్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఈ ప్రభుత్వం చల్లాల్సిన 34 వేల కోట్ల ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డి.ఏ లు మంజూరు చేయాలని, అలాగే 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర ఉద్యోగులకు, కేంద్రం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు తక్షణమే రావలసిన బెనిఫిట్స్ అన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ రూల్స్ ముసాయిదాలో పెట్టిన 33 సంవత్సరాల సర్వీస్ నిబంధన ప్రకారం ముందస్తు రిటైర్మెంట్ అధికారం ప్రభుత్వానికి ఇవ్వడం సరికాదని,ఇది పూర్తిగా తొలగించాలని, సర్వీస్ లో ఉన్న టీచర్స్ కు టెట్ ఎగ్జామ్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కారం చూపాలని లేని పక్షంలో ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించడం జరిగింది. సుమారుగా 50 మంది ఉపాధ్యాయుల వరకు పాల్గన్నారు .ప్రత్యేకించి రాష్ట్ర కౌన్సిలర్ వి గోవింద రావు,ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ దొర ,జిల్లా కార్యవర్గ సభ్యులు డి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు జిల్లా బాల్య ఆరోగ్య సంరక్షణ కేంద్రం భరోసా



**పలాస, పతాకం న్యూస్:** పుట్టుకతోనే గుండె సంబం ధిత సమస్యలతో బాధపడు తున్న చిన్నారులకు జిల్లా బాల్య ఆరోగ్య సంరక్షణ కేంద్రం భరోసా ఇస్తుందని డీఎంహెచ్‌వో డా.కె.అనిత అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసు పత్రిలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివరంజని, పీడియాట్రిక్ విభాగాధిపతి డా.పి. రాము పర్య వేక్షణలో విశాఖపట్నానికి చెందిన ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డా. అశోక్‌రాజు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అత్యాధునిక పరికరాలతో 2డి-ఎకో, కార్డియోగ్రఫీ పరీక్షలు చేశారు. గుండె సమస్య లు తీవ్రంగా ఉన్న చిన్నారులను గుర్తించి, వారికి మెడికవర్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథ కంలో శస్త్ర చికిత్సలను పూర్తి ఉచితంగా చేస్తా మని తెలిపారు. శుక్రవారం టెక్కలి జిల్లా ఆసు పత్రి డీఈఐసీ కేంద్రంలో వైద్య శిబిరం నిర్వ హించారు., గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నూక చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పుణ్యగిరి వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలి



**శృంగవరపుకోట, పతాకం న్యూస్:** మహాశివరాత్రి సమయంలో పుణ్యగిరి ఉమా కోటి లింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి భద్రతే ముఖ్యమని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ఆలయాన్ని ఆయన సందర్శించారు. మెట్లపై నుంచి కొండపైకి నడిచి వెళ్లారు. క్యూలైన్‌లను పరిశీలించారు. పుట్టదార వద్ద భక్తుల స్నానాల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. కొండపై నుంచి భక్తులు కిందకు దిగేటప్పుడు రేగపుణ్యగిరి రోడ్డు నుంచి వచ్చేందుకు ఏర్పాటు చేసిన రహదారిని కూడా పరిశీలించారు. దారిలోని పొదలను తొలగించాలని ఆదేశించారు. రెండు వైపులా కర్రలతో భద్రత కలిగిన రైయిలింగ్‌ను ఏర్పాటు చేయించాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. పుణ్యగిరి, రామతీర్థాలకు శివరాత్రి సమయంలో 50వేలకు పైబడి భక్తులు హాజరవుతారని, రద్దీకు అనుగుణంగా భద్రతను పెంచుతున్నామని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి చెప్పారు. ఏర్పాట్లు పరిశీలన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పుణ్యగిరి కొండపైకి భక్తులంతా ఒకేసారి వెళ్లకుండా నియంత్రిస్తామని, విడతల వారీగా వెళ్లాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో దాట్ల కీర్తి, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్, పుణ్యగిరి ఉత్సవ కమిటీ చైర్మన్ పెదగాడ అప్పలరాజు ఉన్నారు.

## రూ.14 కోట్ల మార్కెట్ ఫీజు వసూలే లక్ష్యం

**బొబ్బిలి, పతాకం న్యూస్:** విజయనగరం జిల్లాలో మొత్తం 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయని, వాటి ద్వారా రూ. 14 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యం అని జిల్లా మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టరు రవికిరణ్ తెలిపారు. స్థానిక ఏఎంసీలో సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు రూ.5.89 కోట్ల మార్కెట్ ఫీజు వసూలైందన్నారు. సివిల్ సప్లయిస్ నుంచి రూ.22 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. ఆ బకాయిలు విడుదలైతే మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యాలు నెరవేరతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 చెక్‌పోస్టులు ఉన్నాయని, వాటిని బలోపేతం చేస్తామన్నారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించినట్టు తెలిపారు. బొబ్బిలి ఏఎంసీలో రూ. 3 కోట్లు మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యం కాగా ఇంతవరకు రూ.1.10 కోట్లు వసూలైందన్నారు. మార్చి నెలాఖరునాటికి జిల్లాలో లక్ష్యాలను నెరవేర్చుతామని తెలిపారు. జిల్లాలో ఏడు రైతు బజార్లు ఉన్నాయని, బొబ్బిలిలో రైతు బజారు ఏర్పాటు కోసం జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్, కమిషనరులతో చర్చించామన్నారు.

## శ్రీముఖలింగంలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మహాశివ రాత్రి పురస్కరించుకుని శ్రీముఖలింగంలో చేపడుతున్న పారిశుధ్య పనులు పక్కాగా ఉండాలని జడ్పీ సీఈవో వి.సత్యనారాయణ, డీపీవో భారతీ సౌజన్య సూచించారు. ఈ మేరకు మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాలతో పాటు గ్రామంలో అన్ని వీధులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కాలువల్లోని చెత్తాచెదారాన్ని, మట్టిని తొలగించాలన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. నాలుగు రోజులపాటు నిర్వ హించే ఈ ఉత్సవాలకు గ్రామాన్ని, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచా లని, ఎప్పటికప్పుడు చెత్త ను తొలగించాలన్నారు. శ్రీముఖలింగం వచ్చే భక్తులకు ప్రతి వీధిలోను తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేసి నీటిసౌకర్యం కల్పించాలన్నారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో బి.చిన్నమ్మడు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

## ఏర్పాటు చేశాం: చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బ తీస్తున్నారని దుయ్యబట్టారు. తిరుమల లడ్డూ కల్తీకి హెరిటేజ్?కు ఏం సంబంధమని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా హెరిటేజ్ అడగలేదన్న చంద్రబాబు పేపర్ ఉంది కదా అని పెద్ద హెడ్ లైన్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాండ్ డ్యామేజ్ చేస్తే హెరిటేజ్‌కు నష్టం వస్తుందని వాళ్ల భావన అని, నాడు వివేకాను చంపి కూడా నారాసుర రక్తచరిత్ర అని రాశారని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. రికార్డు స్థాయిలో పింఛన్లు ఇవ్వటంతో పాటు మహిళకు ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాలను సమర్థవంతంగా ఇస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నా కేంద్రం సాయంలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. వెంటిలేటర్?పై ఉన్న రాష్ట్రం కోలుకునేలా కేంద్రం మద్దతు ఇచ్చిందని సీఎం అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కేంద్రం కూడా భాగస్వామ్యం కావటంపై సంతోషం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ సహా అన్ని పథకాలకూ సాయం అందించిన కేంద్రప్రభుత్వంపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా 10 సూత్రాలు అమలు చేసి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా పని చేస్తున్నామని క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను గుర్తు చేసుకుని రాబోయే మూడేళ్ల లక్ష్యాలను నిర్దేశించుకుందామని అన్నారు. వైఎస్సార్సీపీకి 11 సంఖ్యతో అవినాభావ సంబంధం ఉందని అందుకే 11 నిమిషాలకే బయటకు వెళ్లారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం, భూ అక్రమాలను చంద్రబాబు ఎండగట్టారు. “పీపీపీలో ఏదైనా నిర్మిస్తే నిర్ధిష్టకాలం ప్రైవేటు వ్యక్తులు నిర్వహించి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. సంపద రావాలి అభివృద్ధి జరగాలి. సంపద కొంతమంది దగ్గరే పరిమితమవ్వడం సరికాదు. అందరూ శ్రద్ధగా పనిచేస్తే పీ4 దేశంలోనే ఆదర్శంగా మారుతుంది. ప్రతి ఇల్లు సోలార్ విద్యుత్ తయారు చేసేలా ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలి. త్వరలోనే ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను కేటాయిస్తాం. ఏం తినాలి ఏం చేయాలో ఏఐ డాక్టర్ చెబుతుంది. విశాఖలో 15 బిలియన్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం.” అని సీఎం చంద్రబాబు తెలిపారు. అప్పుడు చేసిన రెవెన్యూ పాపాలు కడగడానికే ప్రభుత్వానికి ఏడాది సమయం పట్టిందన్నారు. మద్యం విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించబోమని సీఎం హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో డబ్బుల కోసం ప్రాణాలను తీసుకున్నారని, కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఇసుక విధానంపైనా కూటమి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలపై రాజముద్ర వేయించి ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దడానికి సుమారు ఏడాది పట్టిందని చెప్పారు. ఎవరూ ట్యాంపరింగ్ చేయని విధంగా చేసి లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు. చట్టసభ అనేది ప్రజా దేవాలయమని విద్యార్థులను అసెంబ్లీకి అనుమతించటం ప్రత్యేకమని సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారని, సభలో సభ్యులకంటే వారే బాగా ప్రసంగించారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయాల పట్ల అవగాహన కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. రాబోయే మూడేళ్లలో ఉత్తరాంధ్రలో అన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాయలసీమలోని ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామన్నారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ ప్రశంసలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారతదేశంతో కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'చారిత్రాత్మకం'గా అభివర్ణించారు. అమెరికా బొగ్గు ఎగుమతులను గణనీయంగా పెంచే దిశగా జపాన్, కొరియా, భారతదేశం తదితర దేశాలతో కీలక ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. 'ఛాంపియన్ ఆఫ్ కోల్' కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, "మా నాయకత్వంలో అమెరికా భారీ ఇంధన ఎగుమతిదారుగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా మా బొగ్గు అత్యుత్తమ నాణ్యత కలిగి ఉంది," అని అన్నారు. గత వారం అమెరికా-భారత్ మధ్య వాణిజ్యంపై తాత్కాలిక ఒప్పందానికి మార్గదర్శకాలను సిద్ధంచేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం భారత్ అనేక అమెరికా యొక్క పారిశ్రామిక వస్తువులు, ఆహార మరియు వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడానికి లేదా తొలగించడానికి అంగీకరించింది. అలాగే రాబోయే ఐదు సంవత్సరాల్లో సుమారు 500 బిలియన్ల విలువైన అమెరికన్ ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో ఇంధన ఉత్పత్తులు, విమానాలు మరియు విమాన భాగాలు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గు తదితర అంశాలు ఉన్నాయి. ఫిబ్రవరి 6న విడుదలైన సంయుక్త ప్రకటనలో ఈ ఒప్పందం పరస్పర ప్రయోజనకర వాణిజ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ మరియు భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన విస్తృత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఏ) చర్చలకు ఈ మార్గదర్శకాలు మరింత బలం చేకూర్చుతున్నాయని అధికారులు తెలిపారు. అదనపు మార్కెట్ యాక్సెస్, సరఫరా గొలుసుల స్థిరత్వం వంటి అంశాలపై రెండు దేశాలు ముందుకు సాగనున్నాయి.

## వివాహమైనా.. మతం మారినా కులం మారదు: అలహాబాద్ హైకోర్టు



**అలహాబాద్:** వివాహం లేదా మత మార్పిడి కారణంగా ఒక వ్యక్తి పుట్టుకతో వచ్చిన కులం మారదని అలహాబాద్ హైకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులో నిందితులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను కొట్టివేస్తూ జస్టిస్ అనిల్ కుమార్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ఎస్సీ వర్గానికి చెందిన ఓ మహిళపై దినేశ్ అనే వ్యక్తితో పాటు మరో 8 మంది దాడి చేసి, కులం పేరుతో దూషించారు. ఈ ఘటనలో బాధితురాలితో సహా ముగ్గురు గాయపడ్డారు. దీంతో బాధితురాలు వారిపై అలీగఢ్‌లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఐపీసీతో పాటు ఎస్సీ/ఎస్టీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ప్రత్యేక న్యాయస్థానం నిందితులను ఆదేశించింది.

## మంత్రి లోకేశ్ వినూత్న కార్యక్రమం.. ఎమ్మెల్యేలతో డిన్నర్ భేటీలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధులతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు, వారి నియోజకవర్గ సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'ఆత్మీయ కలయిక.. ఇల్లే వేదిక' పేరుతో డిన్నర్ సమావేశాలను ప్రారంభించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా తన నివాసానికే ఎమ్మెల్యేలను, వారి కుటుంబ సభ్యులను విందుకు ఆహ్వానిస్తున్నారు. మొదటి సమావేశం మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులతో జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్ వారితో, వారి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఇది కేవలం విందుకే పరిమితం కాలేదు. నియోజకవర్గాల్లోని సమస్యలపై వారితో చర్చించి, గతంలో వారు ఇచ్చిన వినతుల తాజా పరిస్థితిని నివేదిక రూపంలో అందజేశారు. ఈ ఆత్మీయ కలయికకు వచ్చిన ఆడపడుచులకు లోకేశ్ మంగళగిరి పట్టుచీరలను బహూకరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసే మార్చి 7వ తేదీ వరకు ఈ డిన్నర్ సమావేశాలు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఒక జిల్లాకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు తమ కుటుంబాలతో కలిసి ఈ విందులో పాల్గొంటారు. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు కీలక సూచనలు చేశారు. కూటమి ఐక్యత క్షేత్రస్థాయిలోనూ కొనసాగాలని, సభలో అంశాలపై పూర్తి సన్నద్ధతతో ఉండాలని హితవు పలికారు. తాను కూడా సుమారు 40 మంది ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి పనితీరును సమీక్షిస్తానని స్పష్టం చేశారు.

# 14న బడ్జెట్‌పై సిక్కోలు వాసుల కోటి ఆశలు!



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా అభివృద్ధి రథచక్రాలు ముందుకు సాగాలంటే 'నిధుల' ఇంధనం అత్యవసరం. ఈనెల 14న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై సిక్కోలు వాసులు కోటి ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలోని ఈ కీలక బడ్జెట్ సమావేశాల్లో జిల్లాకు అగ్రతాంబూలం దక్కుతుందని రైతులు, నిరుద్యోగులు, మేధావులు భావిస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అరకొర నిధులతో ఆగిపోయిన పనులు ఈసారైనా పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా రైతులు ప్రధానంగా వంశధార నదిపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులు పూర్తి కావాలంటే దాదాపు రూ.200 కోట్లు తక్షణం కేటాయించాలి. ముఖ్యంగా హిరమండలం రిజర్వాయర్ నిర్వాసితుల పరిహారం, 87, 88 ప్యాకేజీల పనులు పూర్తి కాకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం గగనమవుతోంది. అలాగే మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీటికి ఈ బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు జరగాలి. తోటపల్లి కాలువల ఆధునికీకరణకు నిధులు విదిల్చితే తప్ప మెట్టప్రాంతం సస్యశ్యామలం కాదు. వలసల జిల్లాగా పేరున్న శ్రీకాకుళంలో పారిశ్రామిక వెలుగులు నింపేందుకు మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరగాలి. పోర్టు అనుసంధాన రహదారులు, మౌలిక వసతులకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. పైడి భీమవరం పారిశ్రామికవాడలో కాలుష్య నియంత్రణ చర్యలతోపాటు, కొత్తగా ఆమదాలవలస, టెక్కలి ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలన్న డిమాండ్ ఉంది. బుడగట్లపాలెం, మంచినీళ్లపేట తీరం వద్ద జెట్టీలు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం వేగవంతానికి పూర్తిస్థాయిలో నిధులు వెచ్చించాల్సి ఉంది. మత్స్యకారులు ఉపాధికోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. ఈ అంశమై జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించి.. ప్రభుత్వం నిధులు మంజూరు చేయించేలా ఒత్తిడి తేవాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన గ్రామాల రోడ్ల అనుసంధానానికి భారీగా నిధులు కావాలి. ఇక ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం నిర్మించిన రీసెర్చ్ సెంటర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి, డయాలసిస్ కేంద్రాల నిర్వహణకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం, శాలిహుండం వంటి పుణ్యక్షేత్రాలను కలుపుతూ 'టెంపుల్ టూరిజం సర్క్యూట్' ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తే జిల్లా ఆదాయం పెరుగుతుంది. ఈ దిశగా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి.. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు, నదుల అనుసంధానం.. పారిశ్రామికాభివృద్ధి చెందేలా.. బడ్జెట్‌లో నిధుల కేటాయింపునకు కృషి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# 'ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ'తో రైతులకు ప్రయోజనం




**పాడేరు, పతాకం న్యూస్:** అన్నదాతలకు బహుళ ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో 'ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ' (ఏపీఎఫ్ఆర్)ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో భూమి కలిగిన ప్రతి రైతు విధిగా ఏపీఎఫ్ఆర్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 10 నుంచి దానిని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదైన రైతులకు ప్రభుత్వం 11 అంకెలతో కూడిన యూనిక్ ఫార్మర్ ఐడీ నంబర్‌ను కేటాయిస్తుంది. దీంతో భవిష్యత్తులో రైతులకు సంబంధించిన అన్ని రకాల ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి కానుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ' (ఏపీఎఫ్ఆర్)ప్రక్రియతో జిల్లాలోని లక్షా 58 వేల మంది రైతులకు బహుళ ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలో అనంతగిరిలో 12,726 మంది రైతులు, అరకులోయలో 12,388, చింతపల్లిలో 16,127, డుంబ్రిగుడలో 14,578, జి.మాడుగులలో 15,518, జీకేవీధిలో 15,8978, హుకుంపేటలో 18,000, కొయ్యూరులో 14,126, ముంచంగిపుట్టులో 12,058, పాడేరులో 12,276, పెదబయలులో 14,404 మంది రైతులున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 58 వేల 78 మంది రైతులకు గాను కేవలం రెండు రోజుల్లో 75 వేల 847 మంది రైతులు నమోదు చేసుకున్నారు. ఇంకా మిలిగిన రైతులు సైతం విధిగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో పూర్తి స్థాయిలో ఇంటర్నెట్ సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో 'ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ' (ఏపీఎఫ్ఆర్)ప్రక్రియను చేపట్టేందుకు వ్యవసాయాధికారులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీలుండగా, నేటికీ 30 శాతం పంచాయతీలకు ఇంటర్నెట్ సదుపాయం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియకు సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు పాడేరు మండలం డోకులూరు, బరిసింగి పంచాయతీ కేంద్రాల్లో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేకపోవడంతో గురువారం పాడేరుకు శివారున ఉన్న బరికొండ వద్ద రైతులను రప్పించి, వ్యవసాయాధికారులు నమోదు ప్రక్రియలను చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరు మండలంలోనే ఈ పరిస్థితులుంటే, ఇక మారుమూల ప్రాంతాల్లో దుస్థితిని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయినప్పటికీ వ్యవసాయాధికారులు, సిబ్బంది ఆశించిన స్థాయికంటే అధికంగానే రైతుల నమోదు ప్రక్రియను చేపట్టడం విశేషం.

# బర్డ్ ఫ్లూపై ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలి: జయరాజ్

**చింతపల్లి, పతాకం న్యూస్:** కోళ్లకు వ్యాప్తి చెందే బర్డ్ ఫ్లూపై ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి(డీఏహెచ్‌వో) డాక్టర్ వి.జయరాజ్ సూచించారు. మండలంలో పర్యటించిన ఆయన లోతుగెడ్డ, లంబసింగి పశువుల ఆస్పత్రిని తనిఖీ చేశారు. అలాగే భీమసింగి కోళ్ల ఫామ్, గొర్రెలు, మేకలు ఫామ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏహెచ్‌వో మాట్లాడుతూ అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ తెగులు ప్రబలిందన్నారు. ఈ మేరకు జిల్లాలోనూ కోళ్లు పెంచుకుంటున్న గిరిజనులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. కోళ్ల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బర్డ్ ఫ్లూ తెగులు లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న పశువైద్యశాలను సంప్రతించి పశువైద్యాధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. పశు వైద్యుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గత నెల 19వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి అల్లూరి జిల్లాలో 1.5 లక్షల కోళ్లకు ఆర్‌డీ టీకాలు వేశామన్నారు. మరో 1.5 లక్షల కోళ్లకు టీకాలు వేసే



కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. 55 వేల మేకలు, గొర్రెలకు షీప్ ఫాక్స్ టీకాలు వేశామని చెప్పారు. మూడు లక్షల పశువులు, మేకలు, గొర్రెలకు డీవార్మింగ్ మందులు వేశామన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు ప్రమాదవశాత్తూ, ప్రకృతి వైపరీత్యాల వలన మరణిస్తే రైతు నష్టపోకుండా ఉండేందుకు బీమా సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి అల్లూరి జిల్లాలో తొలివిడతగా మూడు వేల పశువులు, మేకలు, గొర్రెలకు టీకాలు వేయించామన్నారు. గిరిజన రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై అసక్తి పెంచుకోవాలన్నారు. కోళ్లు, మేకలు, పశువుల పెంపకం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. పశుసంపదకు వ్యాధుల సంక్రమిస్తే వెంటనే పశువైద్యాధికారులకు సమాచారం ఇస్తే వెంటనే మెరుగైన వైద్యం అందిస్తారని తెలిపారు. ఆయన వెంట పశువైద్యులు మత్స్యరాస సౌజన్యదేవి, చల్లంగి చాలిని, సంచార పశువైద్యుడు ఉపేంద్ర ఉన్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా.. అయితే బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లే..



మనల్ని తీవ్ర అనారోగ్యానికి గురి చేయడంతో పాటు కొన్ని సార్లు మరణానికి కూడా దారి తీసే ప్రాణాంతక వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని చెప్పవచ్చు. క్యాన్సర్ లో కూడా వివిధ రకాలు ఉంటాయి. వాటిలో బ్లడ్ క్యాన్సర్ ఒకటి. బ్లడ్ క్యాన్సర్ అనేది ఎముక మజ్జలో ప్రారంభమై రక్తకణాలను ప్రభావితం చేస్తుంది. దీనిని లుకేమియా అని కూడా అంటారు. ఇది మాత్రమే కాకుండా లింఫోమా, మైలోమా వంటి వివిధ రకాల రక్త క్యాన్సర్లు కూడా ఉన్నాయి. ఇక బ్లడ్ క్యాన్సర్ ప్రారంభ లక్షణాలను గుర్తించడం కూడా చాలా అవసరం. ఈ లక్షణాల గురించి చాలా మందికి ఎటువంటి అవగాహన ఉండదు. కనుక బ్లడ్ క్యాన్సర్ ప్రారంభ లక్షణాలను ఇప్పుడు తెలుసుకుందాం.

బ్లడ్ క్యాన్సర్ ప్రారంభదశలో ఉన్నప్పుడు మెడ లేదా చంక భాగాల్లో నొప్పి లేని రబ్బరు లాంటి గడ్డలు ఏర్పడతాయి. ఇవి కొన్ని వారాల పాటు అలాగే ఉంటే తనిఖీ చేసుకోవడం చాలా అవసరం. ఇది లింఫోమా ప్రారంభ సంకేతాలలో ఒకటి. అలాగే విపరీతమైన జ్వరం, రాత్రి సమయంలో చెమటలు ఎక్కువగా ఉండడం కూడా ప్రమాదకరమైన సంకేతాల్లో ఒకటి. లుకేమియా క్యాన్సర్ లో ఇటువంటి లక్షణాలు కనిపిస్తాయి. వారం లేదా నెలలోనే ఊహించనంతగా బరువు తగ్గుతారు. క్యాన్సర్ కణాలు జీవక్రియను ప్రభావితం చేయడం వల్ల శరీర బరువు తగ్గుతుంది. బ్లడ్ క్యాన్సర్ రక్తనిర్మాణాన్ని ప్రభావితం చేస్తుంది. దీంతో శరీరంలో రక్తహీనత తలెత్తుతుంది. రక్తహీనత కారణంగా వ్యాయామం చేసేటప్పుడు అలసట, శరీరం పాలిపోయినట్టుగా ఉండడం, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఇక బ్లడ్ క్యాన్సర్ బారిన పడిన వారిలో చిగుళ్ల నుండి రక్తస్రావం కావడం, చిన్న గాయాల నుండి ఎక్కువ రక్తస్రావం కావడం, సులభంగా గాయాలు కావడం వంటివి జరుగుతాయి. అదే విధంగా లింఫోమా క్యాన్సర్ లో ఎముక నొప్పి, పగుళ్లు, దీర్ఘకాలిక వెన్నునొప్పి వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అలాగే కొన్ని రకాల బ్లడ్ క్యాన్సర్ లల్లో కడుపు నొప్పి ఎక్కువగా ఉంటుంది. కొన్ని రకాల లింఫోమాలు కాలేయాన్ని పెద్దదిగా చేస్తాయి. దీనితో పాటు అజీర్ణం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఇక ఈ లక్షణాలు కనిపించిన వెంటనే గాబరా పడకుండా వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. టీబీ, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, ఐరన్ లోపం వంటి సమస్యల్లో కూడా ఇటువంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. కనుక లక్షణాలు కనిపించిన వెంటనే క్యాన్సర్ అని భావించకుండా, భయపడకుండా తనిఖీ చేసుకోవడం ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు.

# మేకప్ వేసుకునే ముందు కొన్ని టిప్స్..

ముందు రోజుల్లో సినీ ఫీల్డ్‌లో ఉన్నవారు, సెలబ్రిటీలు మాత్రమే మేకప్ వేసుకునేవారు. కానీ, ఇప్పుడలా కాదు. ప్రొఫెషన్ ఏదైనా, ఇంట్లో ఉన్నా, బయటికి వెళ్లినా మేకప్ వేసుకోవడం కామన్ అయిపోయింది. మేకప్ వేసుకోవడం వల్ల ఓ కాన్ఫిడెన్స్ వస్తుంది. దీంతో చాలా మంది మేకప్ వేసుకుంటున్నారు. మీరు కూడా మేకప్ వేసుకోవాలనుకుంటే ముందుగా కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

మేకప్ వేసుకునే ముందు ప్రతి ఒక్కరూ చేయాల్సిన పని ముఖాన్ని నీట్‌గా క్లీన్ చేసుకోవాలి. ఇది ఫస్ట్ ఇంపార్టెంట్ టిప్. దీని వల్ల ముఖంపై ఉన్న జిడ్డు, దుమ్ము పోతుంది. మేకప్ కూడా ఎక్కువసేపు చక్కగా ఉంటుంది.

మేకప్ వేసుకునే ముందు కచ్చితంగా మాయిశ్చర్ రాయాలి. ఇందులో ఫేస్ మిస్ట్, సీరమ్స్, లోషన్స్, క్రీమ్స్ ఉంటాయి. మీ వీలుని బట్టి, మీకు ఏదైతే సెట్ అవుతుందో దానిని ఎంచుకుని ఫస్ట్ మాయిశ్చరైజర్ అప్లై చేయాలి.

మాయిశ్చరైజర్ రాశాక కాసేపు గ్యాప్ ఇచ్చి ప్రైమర్ తీసుకోవాలి. ప్రైమర్ అనేది ఇంపార్టెంట్ స్టెప్ అని చెప్పొచ్చు. ఇది మీకు మేకప్‌ని ఎక్కువసేపు ఉండేలా చేస్తుంది. అదే విధంగా, మేకప్ కూడా స్మూత్‌గా ఉండేలా చేస్తుంది. దీనిని ఫింగర్ టిప్స్ లేదా బ్రష్, స్పాంజ్‌తో అప్లై చేయొచ్చు. ఇది కళ్ళ కింద, ఇతర భాగాల్లో కొద్దిగా మాత్రమే పెట్టి అప్లై చేయాలి. కళ్ళకింద సరిగ్గా అప్లై చేయాలి. లేదంటే మేకప్ ప్యాచెస్‌లా కనిపిస్తుంది. లిక్విడ్ ఫౌండేన్ తీసుకుని రాయాలి. ఇది మీ స్కిన్ టోన్‌కి సరిపోయేది ఎంచుకోవాలి. దీనిని మీరు ఫింగర్ టిప్స్‌తో అయినా ఎంచుకోవచ్చు. లేదా బ్రష్, స్పాంజ్ అయినా వాడొచ్చు. అయితే, చేతులని చక్కగా క్లీన్ చేశాకనే వాడాలి. ఫింగర్ టిప్స్‌తో అప్లై చేశాక.. దీనిని మొత్తం కవర్ చేయడానికి బ్రష్ లేదా బ్లెండర్‌ని వాడండి.

ఇందులో రెండు రకాలు ఉంటాయి. లిక్విడ్, స్టిక్ అదే విధంగా కాంపాక్ట్. ఈ కన్సీలర్‌ని మీకు ముడతలు, కళ్ళకింద సర్కిల్స్, నోటి చుట్టూ కూడా ఎలాంటి మచ్చలు కనిపించకుండా కవర్ చేయొచ్చు. వీటిని వేయడం వల్ల మేకప్ మరింత అందంగా కనిపిస్తాయి. మీ చీక్స్ మెరిసిపోతాయి. బ్లష్ మీ అందాన్ని రెట్టింపు చేస్తుంది. తర్వాత హైలైటర్. దీని వల్ల మీ ముక్కు, చీక్ బోన్స్, ఐస్ కూడా చక్కని రీతిలో కనిపిస్తాయి.

ఈ పౌడర్‌ని వాడకపోతే మీ మేకప్ లుక్ కేకీ లుక్‌లా కనిపిస్తుంది. అందుకే ఈ పౌడర్ని కచ్చితంగా వాడాలి. మంచి ఫ్లఫీ పౌడర్ బ్రష్ తీసుకుని ముందుగా లైట్‌గా కోట్ వేసి పౌడర్ వాడాలి. తర్వాత పౌడర్‌ని స్పాంజ్‌తో తీసుకుని చక్కగా అలా ట్యాప్ చేయండి. ఇప్పుడు ఐ మేకప్‌లో ముందుగా ఐబ్రోస్ సెట్ చేసుకోవాలి. తర్వాత ఐషాడో వేసుకోవాలి. తర్వాత ఐలైనర్, మస్కారా వేసుకోవాలి. లిప్ గ్లాస్ ముందుగా పెట్టేసుకుని తర్వాత ఇష్టమైన లిప్‌స్టిక్ వేసుకోవచ్చు. దీంతో మేకప్ లుక్ ఫినిష్ అవుతుంది.

సెట్టింగ్ స్ప్రే అనేది ఫైనల్ టచ్. దీని వల్ల మేకప్ రోజంతా అలానే ఉంటుంది. వెంటనే ఆయిలీగా కనిపించకుండా షైనీగా ఉంటుంది.



## ఇరాన్ దిశగా కదులుతున్న అమెరికా సేనలు



**ఇరాన్:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్న వేళ, ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇరాన్‌తో అణు కార్యక్రమంపై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం, కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్... అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ గ్రావ్యాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు పొడిగించవచ్చని తెలుస్తోంది. గతంలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్యలో జెరాల్డ్ ఫోర్డ్ నుంచే యుద్ధ విమానాలు పాల్గొన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకే అమెరికా ఈ చర్య తీసుకుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ యుద్ధ నౌక తరలింపు పశ్చిమాసియాలో కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

# ఏజెన్సీలో కాఫీ సాగు విస్తృతం .. మరో లక్ష ఎకరాల్లో పంట



**పాడేరు, పతాకం న్యూస్:** ప్రభుత్వం పాడేరు ఏజెన్సీ పరిధిలో కాఫీ సాగును రానున్న ఐదేళ్లలో విస్తృతంగా చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే లక్ష ఎకరాల్లో పంటను విస్తరించనుంది.ప్రస్తుతం 2.58 లక్షల ఎకరాల్లో పాడేరు ఐటీడీఏ పరిధిలోని పాడేరు, అరకు వ్యాలీ, చింతపల్లి ప్రాంతాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. రైతుల్ని ప్రోత్సహించి మరో లక్ష ఎకరాల్లో ఈ పంటను విస్తరించనున్నారు. దీంతోపాటు కాఫీ పంట పునరుద్ధరణ కింద 75 వేల ఎకరాల్లో సాగును చేపట్టనున్నట్లు సమాచారం. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 202 కోట్లు. కాఫీ సాగులో ప్రస్తుతం దేశంలో కర్ణాటక, కేరళ తర్వాత ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. 2031 నాటికి సాగును విస్తరింపచేసి తద్వారా రాష్ట్రాన్ని రెండో స్థానంలో నిలపాలన్నది ప్రభుత్వ లక్ష్యమని సంబంధిత అధికారులు వివరిస్తున్నారు.

కాఫీ పంటకు సూర్యరశ్మి నేరుగా తాకకుండా సరిపడా నీడ ఉండాలి. కొత్తగా చేపట్టే లక్ష ఎకరాల సాగు విస్తరణలో 60 వేల ఎకరాల్ని షేడ్ ప్లాంటేషన్ విధానంలో అందుబాటులోకి తీసుకురానున్నారు. సిల్వర్ ఓక్, మామిడి, నేరేడు, పనస మొక్కల్ని సాగు చేయించి నాలుగో ఏడాది వాటి నీడన కాఫీని పెంచుతారు. మిగతా షేడ్ ప్లాంటేషన్ విధానంలో ఉన్న 40 వేల ఎకరాల్లో కాఫీని సాగు చేసేందుకు రైతుల్ని సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం 'వీబీ-జీ రామ్ జీ' (ఉపాధి హామీ) పథకాన్ని అనుసంధానించనున్నారు. కేంద్రం ఇప్పటికే రూ.కోటి మంజూరు చేసింది. ఈ ఏడాది ఇప్పటికే 30 వేల ఎకరాల్లో షేడ్ ప్లాంటేషన్‌ను చేపట్టారు. పాడేరు ఏజెన్సీ పరిధిలో రానున్న ఐదేళ్లలో 75 వేల ఎకరాల్లో కాఫీ పంటను పునరుద్ధరించాల్సిన అవసరముందని అధికారులు గుర్తించారు. ఉత్పత్తి తగ్గి ఆదాయం పడిపోయిన రైతుల పొలాల్లో పునరుద్ధరణ చర్యలు చేపడతారు. ఏటా 15 వేల ఎకరాల్లో పునరుద్ధరణ చేపట్టేలా అధికారులకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. కాఫీ పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపిన రైతులకు ఎకరాకు 1000 మొక్కల్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఒక్కో రైతు ఎకరం నుంచి గరిష్ఠంగా 5 ఎకరాలు సాగు చేసేందుకు సహకారం అందించనుంది. మొక్కలు నాటిన ఏడేళ్లకు కాఫీ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఎకరాకు రూ.25 వేల వరకు ఆదాయం ఉండనుంది. 40-50 ఏళ్లపాటు స్థిరంగా ఉత్పత్తి ఉండనుంది. కాఫీలో అంతర పంటలు కూడా సాగు చేయొచ్చు. మిరియాల సాగును ప్రోత్సహించేందుకు ఎకరాకు 100-200 మొక్కల్ని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది. ఏడేళ్లకు దీని ఉత్పత్తి ప్రారంభమవుతుంది. తర్వాత ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది.

కాఫీ సాగుకు సరిపడా నీడ లేని రైతుల పొలాల్లో ముందుగా సిల్వర్ ఓక్, మామిడి, నేరేడు, పనస మొక్కల్ని నాటుతారు. వీటిని ఎకరాకు 1000 మొక్కల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఇవి మూడేళ్లలో ఐదు నుంచి ఆరు అడుగుల ఎత్తు పెరుగుతాయి. తర్వాత వాటి నీడలో కాఫీ మొక్కల్ని పెంచుతారు. ఏపుగా పెరిగిన సిల్వర్ ఓక్ ఆసరాగా మిరియాలను అంతర పంటగా సాగు చేయవచ్చు. రెండు కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్లు: కాఫీ రైతులకు అండగా నిలిచేందుకు రూ.7 కోట్ల వ్యయంతో జీకే వీధి, జి.మాడుగులలో రెండు ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొస్తారు. రైతులకు అల్యూమినియం నిచ్చెనలు, బేబీ పల్పర్స్, టార్పాలిన్లు ఇస్తారు. ఇదే కాకుండా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో మాకవరపాలెంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు.




# నమీబియాపై టీమిండియా గెలుపు



టి20 ప్రపంచకప్ గ్రూప్-ఎలో భారతజట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకొని అగ్రస్థానానికి ఎగబాకింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో నమీబియాతో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 93 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 209పరుగుల భారీస్కోర్ నమోదు చేయగా.. ఛేదనలో నమీబియా జట్టు 18.2ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. నమీబియా జట్టు టాపార్డర్ బ్యాటర్లు స్టీన్‌కాంప్(29), ఫ్లింకెన్(22), కెప్టెన్ ఎరాస్మస్(18) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. భారతజట్టు బౌలర్లు వరుణ్ చక్రవర్తికి మూడు, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యాకు రెండేసి, అర్ష్‌దీప్, దూబే, బుమ్రాకు ఒక్కో వికెట్ దక్కాయి. తొలుత ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా అర్ధసెంచరీలకి తోడు సంజు శాంసన్, తిలక్ వర్మ రాణించడంతో భారత జట్టుకు అదిరిపోయే ఆరంభం లభించింది. ఇషాన్ కిషన్ 20బంతుల్లోనే అర్ధసెంచరీతో మెరిసాడు. ఓవ రాల్‌గా 24 బంతుల్లో 61 పరుగులతో రాణించాడు.

దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 86 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ తర్వాత తిలక్ వర్మ (25), సూర్యకుమార్ యాదవ్ (12) త్వరగానే వెనుదిరిగినా, హార్దిక్ పాండ్యా (52; 28బంతుల్లో 4ఫోర్లు, 4సిక్సర్లు) అద్భుత అర్ధ సెంచరీతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. దీంతో భారతజట్టు 16ఓవర్లు ముగిసేసరికి 4వికెట్ల నష్టానికి 184పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. చివర్లో టీమిండియా కేవలం 4 పరుగుల తేడాతో 5 వికెట్లు కోల్పోయింది. నమీబియా బౌలర్లు ఎరాస్మస్ (4/20) మెరిసాడు.

**ఇండియా ఇన్నింగ్స్:** ఇషాన్ కిషన్ (సి)షింకోంగో (బి)ఎరాస్మస్ 61, సంజు శాంసన్ (సి)స్టీన్‌కాంప్ (బి)షికాంగో 22, తిలక్ వర్మ (సి)స్మిత్ (బి)ఎరాస్మస్ 25, సూర్యకుమార్ (స్టంప్)గ్రీన్ (బి)స్కోల్ట్జ్ 12, హార్దిక్ పాండ్యా (సి)లిచెర్ (బి)ఎరాస్మస్ 52, దూబే (రనౌట్)షికోంగో (బి)ఎరాస్మస్ 23, రింకు సింగ్ (సి)ఎరాస్మస్ (బి)స్మిట్ 1, అక్షర్ పటేల్ (బి)ఎరాస్మస్ 0, వరుణ్ చక్రవర్తి (నాటౌట్) 1, అర్ష్‌దీప్ (రనౌట్)క్రుగర్ (బి)గ్రీన్ 2, అదనం 10. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 209 పరుగులు.

## టీ20 ప్రపంచకప్‌లో సంచలనం.. ఆస్ట్రేలియాపై జింబాబ్వే విజయం



టీ20 ప్రపంచ కప్‌లో అద్భుతం జరిగింది. ఆస్ట్రేలియా జట్టును జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఓడించి సంచలనం సృష్టించింది. కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా చతికిలపడింది. 19.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా ఆటగాడు మాట్ రెన్‌షా 65 పరుగులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (31) మంచి భాగస్వామ్యం అందించాడు. జింబాబ్వే బౌలర్ బ్లెస్సింగ్ ముజర్బానీ 17 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. బ్రాడ్ ఇవాన్స్ మూడు, మసకద్జ, బర్ల్ చెరో వికెట్ తీశారు.

మొదటి ఐదు ఓవర్లలో ఆస్ట్రేలియా 4 వికెట్లు కోల్పోయి 29 పరుగులు మాత్రమే చేసింది. ఆ తర్వాత మాట్ రెన్‌షా, మ్యాక్స్‌వెల్ 77 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. వీరి భాగస్వామ్యం లేకుంటే ఆస్ట్రేలియా మరింత అవమానకరంగా ఓడిపోయి ఉండేది.




## వాలెంటైన్స్ డే కానుకగా 14న థియేటర్స్‌లోకి రానున్న 'కపుల్ ఫ్రెండ్లీ'



రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న థియేటర్లలో విడుదల కానుంది. అయితే, విడుదలకు ఒక రోజు ముందే, అంటే ఫిబ్రవరి 13న, తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలను ఏర్పాటు చేశారు.

హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ఏఏఏ సినిమాస్‌లో, విశాఖలోని మెలోడీ, విజయవాడలోని శైలజ థియేటర్లలో, గుంటూరులోని భాస్కర్ థియేటర్‌లో రాత్రి 7 గంటలకు ప్రీమియర్లు ప్రారంభమవుతాయి.

అలాగే, నెల్లూరు ఎం1 సినిమాస్‌లో రాత్రి 9 గంటలకు, తిరుపతి పీజీఆర్ థియేటర్‌లో సాయంత్రం 6:45 గంటలకు ఈ స్పెషల్ షోలను ప్రదర్శించనున్నారు.

యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై అజయ్ కుమార్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. చెన్నై నేపథ్యంలో సాగే ఈ కథలో ఇంటీరియర్ డిజైనర్‌గా సంతోష్ శోభన్, ఐటీ ప్రొఫెషనల్‌గా మానస వారణాసి నటిస్తున్నారు. బైక్ పూలింగ్ ద్వారా పరిచయమైన వీరిద్దరి మధ్య నడిచే ప్రేమకథే ఈ సినిమా. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలవుతున్న ఈ చిత్రానికి అదిత్య రవీంద్రన్ సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభించడంతో సినిమాపై ఆసక్తి నెలకొంది.

## ఆగస్టు 21న నాని 'ప్యారడైజ్'



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. ఇందులో నాని 'జడల్' అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మారుస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ప్రకటించిన మార్చి 26కు బదులుగా, ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నాని తన 'ఎక్స్' ఖాతాలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ "2026 ఆగస్టు 21 అని పోస్ట్ చేశారు. విడుదల తేదీ మార్పు వెనుక బలమైన వ్యూహం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆగస్టు 21 తర్వాత దాదాపు మూడు వారాల పాటు వరుస పండగలు రానున్నాయి. ఓనం, మిలాద్-ఉన్-నబీ, ఆ తర్వాత వారాంతంలో రక్షాబంధన్, మూడో వారంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి పండగలు ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టేందుకు ఇది గొప్ప అవకాశంగా చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇంతటి భారీ బడ్జెట్ చిత్రానికి ఈ సెలవుల సీజన్ బాగా కలిసొస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




## మార్చి 5న 'సతీ లీలావతి'



లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ జంటగా నటించిన సినిమా 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వంలో నాగ మోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మార్చి 6న ఈ మూవీని విడుదల చేయబోతున్నట్టు తాజాగా చిత్రబృందం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ 'ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఈ సినిమాను చూసి పెద్ద హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. తాతినేని సత్య మాట్లాడుతూ, 'కమల్ హాసన్ గారు చేసిన 'సతీ లీలావతి'తో నా సినిమాని పోల్చను. అయితే అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను తీశాను' అని చెప్పారు. 'పాత 'సతీ లీలావతి' ఎంత పెద్ద హిట్ అయ్యిందో ఈ సినిమా కూడా అంత హిట్ కావాలని కోరుకుంటున్నా'నని నటుడు సప్తగిరి అన్నారు. ఈ చిత్రంలో నరేష్, వీటీవీ గణేష్, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, జోషి తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**